క్లుప్తంగా

భారీ అన్నదానాలు



గోపాలపట్నంలో అన్నప్రసాదాలు వడ్డిస్తున్న గణబాబు

గోపాలపట్నం: పలు వినాయక మండపాల్లో శుక్రవారం అన్నదానాలు నిర్వహించారు. గోపాలపట్నం ప్రధాన రహదారిలో సీఎంఆర్ దుకాణం వద్ద ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ప్రభుత్వ విప్ గణబాబు ప్రారంభించారు. అలాగే గోపాలపట్నం గణేష్‌నగర్‌లో, పాతగోపాలపట్నం బాల గణేష్ యూత్ ఆధ్వర్యంలో భారీ అన్నదానాలు చేపట్టారు. వేలాది మంది అన్నప్రసాదాలు స్వీకరించారు.

పార్కింగ్ చార్జీలు తగ్గించాలని వినతి



సీనియర్ డీసీఎంకు వినతిపత్రం సమర్పించిన రైల్వే ప్రయాణికులు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలోని రైల్వే స్టేషన్ల వద్ద గల పార్కింగ్ స్థలాల్లో పార్కింగ్ చార్జీలు తగ్గించాలని కోరుతూ పలువురు రైల్వే ప్రయాణికులు శుక్రవారం దొండపర్తి డీఆర్‌ఎం కార్యాలయంలో సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్‌కు వినతిపత్రం సమర్పించారు. విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో నెలవారీ ప్రయాణించే వారికి (మంత్లీ సీజన్ టికెట్ హోల్డర్స్) గతంలో రూ.300 పార్కింగ్ చార్జీలు ఉండేవని, ఇటీవల వీటిని రూ.700కు పెంచారని, ఇది తమకు భారమవుతోందని వారు తెలిపారు. ఈ విషయమై సీనియర్ డీసీఎంకు వినతిపత్రం సమర్పించామన్నారు.

సుప్రీం తీర్పు ప్రకారం పెన్షన్ ఇవ్వాలి



మాట్లాడుతున్న ఆదినారాయణ

పెదగంట్యాడ: సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం పెన్షన్లు ఇవ్వాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఆదినారాయణ డిమాండ్ చేశారు. స్థానిక పెదగంట్యాడ సీడబ్ల్యూసీలో పెన్షనర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపీఎఫ్ 95 పెన్షన్‌దారులందరికీ డిమాండ్ నోటీసులు పంపించాలని కోరారు. సమావేశంలో కణితి అప్పలరాజు, వైటీ దాస్, అప్పలస్వామి, దీనబంధ్, హుస్సేన్, పెంటారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉద్యోగి మృతి



కోన అప్పారావు (ఫైల్)

గాజువాక: ఆటోనగర్ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉద్యోగి మృతి చెందారు. గాజువాక పోలీసులు తెలిపిన వివరాలు.. తుంగ్లాం గ్రామానికి చెందిన కోన చినఅప్పారావు(70) భెల్ హెచ్‌పీవీపీలో పని పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం గాజువాకలోని ఓ దుకాణంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి ద్విచక్ర వాహనం పై విధులకు వెళ్తుండుగా ఆటోనగర్‌లో అన్నా క్యాంటీన్ సమీపంలో ట్రాలర్ ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయన్ను స్థానికులు ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించగా అప్పటికే అప్పారావు మృతి చెందాడని నిర్ధారణ చేసుకుని గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. అప్పారావు భార్య గతేడాది మృతి చెందగా ఆయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ కె.టి.ఆర్.లక్ష్మి, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ అభిషేక్ మిస్త్రీలు సిబ్బందితో కలసి విశాఖ రైల్వే స్టేషన్‌లోని పలు ప్లాట్‌ఫారాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. బిహార్ రాష్ట్రం వెస్ట్ చంపారన్ జిల్లాకు చెందిన సోను కుమార్‌సింగ్ విశాఖ స్టేషన్ మీదుగా బిహార్‌కు అక్రమంగా గంజాయి రవాణా చేస్తుండటాన్ని గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని, సుమారు రూ.49 వేల విలువైన 9.8 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

గ్రీన్‌బెల్ట్‌లను పట్టించుకునే వారేరి..?



మర్రిపాలెం వుడా లేఅవుట్ గ్రీన్‌బెల్ట్‌లో పాడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు



గ్రీన్‌బెల్ట్‌లో జీవం కోల్పోతున్న మొక్కలు

● ఇష్టానుసారంగా వ్యర్థాల పారబోత ● అధ్వానంగా పరిసరాలు ● కానరాని పరిశుభ్రత

గోపాలపట్నం: జీవీఎంసీ 52వ **వార్డు పరిధిలోని** గ్రీన్‌బెల్ట్‌ల నిర్వహణను పట్టించు**కునే వారే కరువ**య్యారు. గత వైఎస్సార్‌సీపీ ప్ర**భుత్వంలో గ్రీన్‌బెల్ట్**లను అభివృద్ధి చేసి సుందరీక**రించారు. వాకింగ్** ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, పిల్లల **ఆట వస్తువులు,** పెద్దలు సేదతీరేందుకు బెంచీలు **ఏర్పాటు చేశారు.** ఆధునిక విద్యుత్ దీపాలు వం**టి ఎన్నో సదుపా**యాలు కల్పించారు. నేడు ఆ గ్రీన్‌బెల్ట్‌ల పరిస్థితి దయనీయంగా మారింది. కొందరు గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో చెత్తాచెదారం వేస్తూ పాడుచేస్తున్నారు. ముఖ్యంగా మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని గ్రీన్ బెల్ట్ పార్కులో తినుబండారాల ప్యాకెట్లు, ప్లాస్టిక్ **వ్యర్థాలు వంటివి పడేస్తుండటంతో మట్టి, పరిసరాలు కలుషితమవుతున్నాయని, మొక్కలు చనిపోతున్నాయని పలువురు పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితులకు తావివ్వకుండా కాలనీల అసోసియేషన్లు బాధ్యత తీసుకుని ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. గ్రీన్‌బెల్ట్ పార్కుల్లో చెత్త వేయకుండా** అసోసియేషన్లు చూడాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. వాకింగ్‌కు వచ్చే వారు ప్లాస్టిక్ సంచులు, ప్యాకేజీ ఫుడ్ తీసుకురాకుండా నిషేధించాలని, గ్రీన్‌బెల్ట్‌లో సేద తీరేవారు ఇలాంటివి తీసుకురాకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. ఇందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని, సమష్టిగా గ్రీన్‌బెల్ట్ పార్కులను కాపాడుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



గ్రీన్‌బెల్ట్‌లో పడి ఉన్న చెత్త డబ్బాలు

ఎఫ్‌ఆర్‌యూ సిబ్బంది ఆకలి కేకలు!

● ఐదు నెలలుగా అందని జీతాలు
● పట్టించుకోని కూటమి పాలకులు



గుల్లలపాలెం ఎఫ్‌ఆర్‌యూ ముఖద్వారం



వైద్య సేవలు పొందుతున్న రోగి

మల్కాపురం: నిత్యం రోగులకు సేవలు అంది**స్తున్న ఆస్పత్రి సిబ్బం**ది అవస్థలు పడుతున్నారు. **ఐదు నెలలుగా వేత**నాలు లేక అప్పులు చేసుకుని **జీవనం సాగిస్తున్నా**రు. అయినా వీరి సమస్యపై **అటు అధికారులు,** ఇటు కూటమి పాలకులు పట్ట**నట్టు వ్యవహరిస్తుండ**డంతో ఎన్నాళ్లు మాకు ఈ **కష్టాలు అంటూ ఆస్ప**త్రి సిబ్బం ఆవేదన వ్యక్తం **చేస్తున్నారు.**

ఇదీ పరిస్థితి

60వ వార్డు పరిధిలో గుల్లపాలెం వద్ద జీవీఎంసీ **నిర్మించిన 30 పడకల** ఆస్పత్రి (ఎఫ్‌ఆర్‌యూ)లో **సుమారు 17 మంది** సిబ్బంది పని చేస్తున్నారు. **వీరిలో ఏఎన్‌ఎం–4** గురు,స్టాఫ్ నర్సులు -3, ల్యాబ్ టెక్నీషియన్- 1,ఫార్మసిస్ట్-1, క్లాస్‌ఫోర్ సిబ్బంది- 6 గురు,అంబులెన్స్ డ్రైవర్ -1 పని చేస్తున్నారు. వీరిలో ఏఎన్‌ఎంలకు నెలకు రూ.15 వేలు, స్టాఫ్ నర్సులకు నెలకు .రూ 17 వేలు, ల్యాబ్ టెక్నీషియన్‌కు నెలకు రూ. 15 వేలు, ఫార్మసిస్ట్‌కు నెలకు రూ .17 వేలు, క్లాస్ ఫోర్ ఉద్యోగికి నెలకు రూ. 15 వేలు, అంబులెన్స్ డ్రైవర్‌కు నెలకు రూ. 10 వేలు చొప్పున వేతనాలు చెల్లిస్తున్నారు. అసలే చాలీ చాలని జీతంతో వీరు బతుకు బండి లాగిస్తుంటే ఇప్పుడు ఐదు నెలల నుంచి వేతనాలు రాకపోవడంతో స్నేహితులు,బంధువుల వద్ద అప్పులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తమ వేతనాలు చెల్లించాలని సిబ్బంది అధికారుల ముందు పలుమార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేదు. దీనిపై గట్టిగా పోరాడితే ఉన్న ఉపాధికి ఇబ్బంది వస్తుందని భయంతో బహిరంగాంగా నోరు మెదపలేక ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు తమ సమస్యపై దృష్టి పెట్టి వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణతో కార్మికులకు నష్టం



మల్కాపురంలో నిరసన ర్యాలీ చేస్తున్న జగ్గునాయుడు, సీపీఎం శ్రేణులు



త్రినాథపురంలో ఇంటింటా కరపత్రాలు పంచుతున్న సీపీఎం నాయకులు

మల్కాపురం: ఎంతోమంది ప్రాణత్యాగాలు చేసి సాధించిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బీజేపీ సర్కార్, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించేందుకు సిద్ధపడుతున్నాయని సీపీఎం జిల్లా నాయకుడు ఎం.జగ్గునాయుడు ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం మల్కాపురంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు అని ప్రపంచ వ్యాప్తంగా ఎంతో పేరుగాంచిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తే వేలాది మంది కార్మికులు రోడ్డున పడే పరిస్థితి కలుగుతుందన్నారు. ఇప్పటికే సుమారు 6 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు రోడ్డున పడ్డారని, కూటమి ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. నమ్మి ఓట్లు వేసిన కార్మికుల విషయంలో కూటమి ప్రభుత్వం ఇలా చేయడం సరికాదన్నారు. ఈ సమస్యపై ఈ నెల 11న గాజువాకలో నిర్వహించిన బహిరంగ సభకు పెద్ద ఎత్తున కార్మికులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాజువాక బహిరంగ సభకు తరలిరండి

సింధియా: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ బారి నుంచి రక్షించేందుకు ఈ నెల 11న గాజువాకలో జరగనున్న భారీ బహిరంగ సభలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయడు పిలుపునిచ్చారు. సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం 62వ వార్డు త్రినాథపురంలో ఇంటింటికీ కరపత్రాల పంపిణీ, పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉక్కు పరిశ్రమను ప్రైవేట్‌కు అప్పగిస్తే లక్షలాది మంది ఉపాధి కోల్పోతారన్నారు. కార్యక్రమంలో సీపీఎం వార్డు నాయకులు పి.రామారావు, ఎల్.కృష్ణ, బి.అర్జునరావు, జి.గణేశ్వరరావు, ప్రసాద్, అప్పారావు, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేల బావుల్లో గంభూషియా చేపల విడుదల

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధిలోని నేల బావిలో గంభూషియా చేపలు వేశారు. మలేరియా విభాగ అధికారి డి.రవికుమార్ ఆధ్వర్యంలోజరిగిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ పాల్గొని నేల బావిలో చేపలను విడిచిపెట్టారు. ఆమె మాట్లాడుతూ గంభూషియా చేపలను నేల బావిలో విడిచిపెట్టడం వల్ల ఆ చేపలు దోమలు పెట్టే గుడ్లు తింటాయని..తద్వారా దోమల ఉత్పత్తి సమస్య తగ్గుముఖం పడుతుందన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రమేష్,సతీష్‌యాదవ్, నాయకులు దాడి సత్యనారాయణ,ఉరుకూటి పైడిరాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

40, 62 వార్డుల్లో..

సింధియా: జీవీఎంసీ 40వ వార్డులోని మంచినీటి బావుల్లో గంభూషియా చేపలను 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు విడుదల చేశారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉంచకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు దరిచేరవన్నారు.ఇంటితో పాటు పరిసరాల్లో రోజులతరబడి నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, మలేరియా సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.



గంభుషియా చేపలను విడుదల చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

● జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లోని నేలబావుల్లో గంభుషియా చేపలను శుక్రవారం మలేరియా నివారణ అధికారులు విడుదల చేశారు. ప్రజలకు సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధుల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి శుక్రవారం, మంగళవారం ఇంట్లో అత్యవసరానికి కావాల్సిన నీటిని ఉంచుకుని, మిగిలిన నీటి పాత్రలను ఆరబెడితే సీజనల్ వ్యాధుల కారక దోమల నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో మల్కాపురం మలేరియా ఇన్‌స్పెక్టర్ డి. రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నవరత్నం, రమేష్, సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, శానిటరీ సూపర్‌వైజర్ గంట్యాడ గోవింద్, నాయకులు మజ్జి మాలినాయుడు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మల్కాపురం: ములగాడ ఫీడర్ పరిధిలోని 58, 59 వార్డుల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ములగాడ హౌసింగ్ కాలనీ, కొత్త నక్కవానిపాలెం, చెక్‌పోస్ట్ ఏరియా, గాజువాక డిపో, ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీ, హనుమాన్‌నగర్, గణపతినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

● ములగాడ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పేర్కొన్నారు. ఈ మేరకు ములగాడలోని హరిజన వీధి, జాలరి వీధి, శెట్టిబలిజ వీధి, వెంకన్నపాలెం, సెవెన్ టెంపుల్ జంక్షన్, నగరాలు వీధి, ఏకేసీ కాలనీ, కేకేఎల్ జీవీఎంసీ పంప్‌హౌస్, ఈఎస్‌ఐ ఆస్పత్రి ఏరియా, ఐఎంయూ, సీఈఎమ్మెస్, సింధియా జంక్షన్, పోస్టాఫీస్ ప్రాంతం, మసీద్ ప్రాంతం, కాకర్లోవ, జయేంద్ర కాలనీ, చింతల్లోవ, క్రాంతినగర్, బీపీసీఎల్ గొడౌన్, వై జంక్షన్, డాక్‌యార్డు ఏరియా, నవయుగ, ఈఐపీఎల్, శాతవాహనా బస్టాప్ ప్రాంతం, కాకతీయ గేట్ ప్రాంతం, ఐఎన్‌హెచ్‌ఎస్ కల్యాణి హాస్పిటల్ ఏరియా, చింతామణి టెంపుల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంన్నారు.

● త్రినాథపురం ఫీడర్ పరిధిలోని గాంధీ వీధి, రజక వీధి, పల్లి వీధి, క్రాంతినగర్, త్రినాథపురం ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఈఈ కోరారు.

రజకులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

అగనంపూడి: శ్రీకాకుళం జిల్లా కొత్తవలసలో రజకులపై దాడి చేసి మహిళ మృతికి కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని విశాఖ జిల్లా రజక సంఘం అధ్యక్షుడు తోకాడ రాము డిమాండ్ చేశారు. ఆరుగురి తలకాయలు పగలడానికి కారణమై, వారిలో ఒకరు మృతి చెందారని దీనికి కారణమైన పోలీసులపై మర్డర్ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలన్నారు. ఈవిషయంలో హోంమంత్రి స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు



గోపాలపట్నం ప్రధాన రహదారిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



మర్రిపాలెంలో శాంతి ర్యాలీ చేస్తున్న ముస్లింలు

గోపాలపట్నం: మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా శుక్రవారం ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాహ మసీద్ ఆధ్వర్యంలో గోపాలపట్నం ప్రధాన రహదారిలో సాయంత్రం 4 గంటలకు ర్యాలీ చేశారు. ప్రభుత్వ విప్ గణబాబు, మసీద్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

మర్రిపాలెం: మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా శుక్రవారం 53వ వార్డులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జాకీర్ హుస్సేన్‌నగర్ మస్జీద్ ఈ అల్ ఖదీర్, మర్రిపాలెం మస్జీద్ ఈ అల్ పత ఆధ్వర్యంలో మసీదుల వద్ద స్థానిక ముస్లింలు ఖురాన్ పఠించారు. మక్కా, మదీనా నమూనాలు ప్రదర్శిస్తూ శాంతి ర్యాలీ చేశారు. అనంతరం దావత్ నిర్వహించారు. కార్యక్రమాన్ని మసీదు కమిటీ అధ్యక్షుడు మున్నా పర్యవేక్షించారు.

విమల విద్యాలయం ఉపాధ్యాయుల నిరసన



తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉక్కునగరం: ఉపాధ్యాయ దినోత్సవం రోజున ఉక్కునగరం విశాఖ విమల విద్యాలయం ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. విమల విద్యాలయాన్ని మూసి వేయడానికి నిరసనగా ఉపాధ్యాయులు కణితి జంక్షన్ కూడలి వద్ద ఉన్న తెలుగు తల్లి విగ్రహం వద్ద ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని ఆందోళన చేపట్టారు. తమకు ఉద్యోగం లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. అంతకు ముందు అక్కడే సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ బి. సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ అనిత, సత్యం, మధుసూదన్, శ్రీనివాస్, నాగవల్లి, జ్యోతి, మణి, రెజీనా, సుధ, శోభ, జయ, శేషమణి, మేరీ సుగుణ, సుశీల, వెంకటరావు, ప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన పవిత్రోత్సవాలు



పవిత్రాలు తీసుకొస్తున్న ఈవో శోభారాణి



అమ్మవారికి పవిత్రాలతో పూజలు చేస్తున్న వేదపండితులు, అర్చకులు

దాబాగార్డెన్స్:

నాలుగు రోజులుగా కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పవిత్ర అవరోహనం, మహా పూర్ణాహుతి, ఆశీర్వచనం జరిపారు. దేవస్థానం వేదపండితులు, అర్చకుల పర్యవేక్షణలో పవిత్రోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

రేపు ఆలయం మూసివేత..

ఈ నెల 7న చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం 1 నుంచి మరుసటి రోజు (8వ తేదీ) ఉదయం 7 గంటల వరకు ఆలయం మూసివేయనున్నట్టు ఈవో శోభారాణి తెలిపారు. అలాగే దర్శనాలు నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. గ్రహణానంతరం సోమవారం తెల్లవారు జామున సంప్రోక్షణ నిర్వహించి, అమ్మవారికి 5 గంటల ప్రాత:కాల పంచామృతాభిషేకం అనంతరం ఉదయం 7 గంటల నుంచి దర్శనాలకు అనుమతించనున్నట్టు చెప్పారు. భక్తులు గమనించాలని ఈవో శోభారాణి కోరారు.

అనాథ శవానికి అంత్యక్రియలు


అల్లిపురం: నెలరోజుల క్రితం ఫుట్‌పాత్ మీద నిస్సహాయ స్థితిలో కనిపించిన వృద్ధుడికి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత ఆశ్రయం కల్పించారు. అంతే కాకుండా అనారోగ్యంతో బాధపడుతున్న అతనికి కేజీహెచ్‌లో వైద్యం కూడా చేయించారు. అతను కోలుకోవడంతో డిచార్జి చేయించి ఐదు రోజుల క్రితం షెల్టర్ కి తీసుకొచ్చారు. అయితే గురువారం నుంచి అతని ఆరోగ్యం మళ్లీ క్షీణించడంతో గోపాలపట్నం ఆస్పత్రికి తీసుకెళ్లారు. దారిలో అతను మరణించాడు. దీంతో విషయాన్ని ఎయిర్‌పోర్ట్ పోలీసులకు తెలియజేసి ఆ అనాథ శవానికి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించినట్లు మమత తెలిపారు.



వృద్ధుడికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న మమత తదితరులు

అంగన్‌వాడీ సిబ్బంది జీతాలు పెంచాలి

తాటిచెట్లపాలెం: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల జీతాలను తక్షణమే పెంచాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. వాసుదేవ నగర్‌లోని సామాజిక భవనంలో శుక్రవారం అసోసియేషన్ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జె.లలిత మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న 56 వేల సిబ్బందికి వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, మెనూ బిల్లులు పెంచాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన పోషకాహార సరకును ప్రతి నెలా 5లోపు సెంటర్లకు చేర్చాలని, అన్ని జిల్లాలకు వేతనాలు సక్రమంగా జమ చేయాలని, లేనిపక్షంలో మిత్ర సంఘాలతో కలిసి మరో పోరాటానికి సిద్ధమవుతామని తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసిందని, వీటిని పునరుద్ధరించే వరకు తాము పోరాడుతామని స్పష్టం చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ ఐక్య పోరాటాల ద్వారా కార్మికుల సమస్యలు పరిష్కారవుతాయన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ఏఐటీయూసీ పనిచేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో కృపారాణి, జిల్లా అధ్యక్షురాలు పి.శ్యామలాదేవి, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటలక్ష్మి, ఎ.నూకరత్నం, పి.సీత, అనిత, అరుణ, రాధారాణి, సుబ్బలక్ష్మి, సంతోషి, లక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి లలిత

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మధురవాడ: విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మధురవాడ పీహెచ్‌సీ, వాంబే కాలనీ యూపీహెచ్‌సీలను సందర్శించారు. ఆయా ఆరోగ్య కేంద్రాలలో సేవలు, ఈహెచ్‌ఆర్, డయాగ్నస్టిక్ సేవలు, మందులు తదితర వాటి గురించి వైద్యాధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వాంబేకాలనీలో ఇద్దరు స్టాఫ్ నర్స్‌లు ఉండాల్సి ఉండగా ఒక్కరే అందుబాటులో ఉన్నట్టు గుర్తించామన్నారు. పైగా కొంతమంది సిబ్బంది కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



వాంబే కాలనీ యూపీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో